www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 26 సెప్టెంబరు 2024



ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలి

మండల ప్రత్యేక అధికారి విక్టర్

ఉండి : ఎన్‌టిఆర్ హౌసింగ్ పథకంలో భాగంగా నిర్మించే ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి ఆర్.విక్టర్ అన్నారు. బుధవారం సాయంత్రం ఉండి ఎండిఒ ఎస్.రవీంద్ర అధ్యక్షతన లే అవుట్ ఇన్‌ఛార్జిలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి ఆర్.విక్టర్ మాట్లాడుతూ 'మన ఇల్లు మన గౌరవం' నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను అక్టోబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని, మిగిలిన ఇంటి నిర్మాణాలను మార్చి 2025 చివరికి పూర్తి చేయించాల్సిన బాధ్యత లేఅవుట్ ఇన్‌ఛార్జిలపై ఉందన్నారు. మార్చి నెలాఖరుకి పూర్తయిన ఇళ్లకు మాత్రమే ప్రభుత్వం నుంచి అందే లబ్ధి చేకూరుతుందన్నారు. కాబట్టి లబ్ధిదారులందరూ నెరవేర్చుకునేందుకు ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన కోరారు.

ఆర్ఎస్ ఆశయ సాధనకు.. పునరంకితమవుతాం

సంస్మరణ సభలో వక్తలు

మతోన్మాదాన్ని అంతా గుర్తించాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

కమ్యూనిస్టులు నాకు మంచి మిత్రులు
మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ


మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

ఎర్రజెండా కోసం తుది వరకూ పోరాడిన ఆర్ఎస్ ఆశయ సాధనకు పునరంకితమవుదామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) సంస్మరణ సభ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన బుధవారం సాయంత్రం జరిగింది. తొలుత ఆర్ఎస్ చిత్రపటానికి మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ, శ్రీనివాసరావు, మంతెన సీతారాం తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్ఎస్ జీవన ప్రస్థానంపై ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఆర్ఎస్ అందరికీ సుపరిచితులన్నారు. జిల్లా కమ్యూనిస్టు, ప్రజా ఉద్యమంలో ఆర్ఎస్ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రైతు, కార్మిక, గీత వంటి ఉద్యమాల్లో అల్లూరితోపాటు ఆర్ఎస్ కీలకపాత్ర పోషించారన్నారు. విద్యార్థి దశ నుంచి పోరాట పటిమతో చట్ట సభల్లో అడుగుపెట్టి ప్రజల పక్షాన ఆర్ఎస్ నిలిచారన్నారు. ఆర్ఎస్ స్ఫూర్తితో జిల్లాలో ప్రజా ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ తాను యువకునిగా ఉన్నప్పుడు ఆర్ఎస్‌తో కలిసి పని చేశానని ఆనాటి స్మృతులను గుర్తు చేశారు. పేదలు, కార్మికుల పోరాటాలతోపాటు కార్యకర్తల బాగోగులు, యోగక్షేమాలు పట్టించుకోవడంలో ఆర్ఎస్‌కు ఎవరూ సాటిరారని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం ఆర్ఎస్ కడవరకూ పోరాడారన్నారు. సభకు బి.వాసుదేవరావు ఆహ్వానం పలుకగా జెఎన్‌వి.గోపాలన్ వందన సమర్పణ చేశారు. సభలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.కళ్యాణి, కేతా గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, పి.వి.ప్రతాప్, సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి, కె.రాజా రామ్మోహన్‌రాయ్, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, ఛాంబర్ మాజీ అధ్యక్షులు గుప్తా, రైస్ మిల్లర్స్ తాలుకా కార్యదర్శి కె.రాజా తదితరులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి సంచికను ఆవిష్కరిస్తున్న నేతలు


సమస్యలపై కలిసి పని చేశాం

మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ

ఆర్ఎస్‌తో నాకు ఎంతో సాన్నిహిత్యం ఉంది. నేను రాజకీయాల్లో అడుగుపెట్టిన సమయంలో నాకు రాజకీయ గురువు ఆర్ఎస్. రైతు, కూలీ, కార్మికుల పక్షాన ఆర్ఎస్ నిరంతరం పోరాడేవారు. పలు సమస్యలపై నేను, ఆయన కలిసి పనిచేశాం. తుందుర్రు ఆక్వా ఫుడ్‌పార్క్ సమస్య, తాగునీరు, కాలుష్యం వంటి సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేవిధంగా నాకు సూచనలు, సలహాలు అందించారు. ఆర్ఎస్ మృతి ప్రజలతోపాటు నాకూ తీరనిలోటు.

పీపుల్స్ ఎంఎల్ఏ ఆర్ఎస్


మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు



ఆర్ఎస్ 75 ఏళ్లపాటు కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్నారు. కేవలం ఐదేళ్లు మాత్రమే అనారోగ్యం రీత్యా ఇంటి వద్ద ఉన్నారు. 2018లో ఆర్ఎస్ జీవిత చరిత్ర పుస్తకాన్ని భీమవరంలో జరిగిన రాష్ట్ర మహాసభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రస్తుతం వారిద్దరూ లేకపోవడం బాధాకరం. వామపక్ష ఉద్యమానికి, కార్మికోద్యమానికి తీరనిలోటు. 1967 నుంచి 1972 వరకూ నరసాపురం ఎంఎల్ఏగా ఆర్ఎస్ పని చేశారు. నిత్యం ప్రజల పక్షానే నిలిచి పీపుల్స్ ఎంఎల్ఏగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆర్ఎస్ జైలులో ఉన్నప్పుడు నేను కమ్యూనిస్టు పార్టీలో చేరాను. యువతను ఆయన ఎంతగానో ప్రోత్సహించేవారు. అప్పట్లో ఆర్ఎస్ విష ప్రచారం చేశారు. ఆయన అభ్యుదయవాది, అంతకుమించి మానవతావాది.

ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి



ఆర్ఎస్ మృతి ప్రజా ఉద్యమాలకు, కుటుంబానికి తీరనిలోటు. అంతిమయాత్రలో వేలాది మంది పాల్గొని ఘనంగా నివాళులర్పించడం ఆర్ఎస్ పట్ల ఉన్న అభిమానానికి నిదర్శనం. చించినాడలో నాటి కసాయి కాంగ్రెస్ ప్రభుత్వం ఐదుగురిని కాల్చి చంపడంతో ఆర్ఎస్ ఉద్యమ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేశారు. సిపిఎం ఉద్యమ నిర్మాణంలో అల్లూరితోపాటు ఆర్ఎస్ ముఖ్యపాత్ర వహించారు.

ఆదర్శ నేత ఆర్ఎస్


మెంటే పార్థసారధి, టిడిపి రాష్ట్ర కోశాధికారి



జిల్లాలో ఆర్ఎస్ అనేక ఉద్యమాలు నిర్వహించారు. కమ్యూనిస్టు నేతగా పోరాటాల్లో నీతి, నిజాయతీ, నిబద్ధతతో పని చేశారు. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారు. దాదాపు వందేళ్లపాటు జీవించిన ఆర్ఎస్ ఆదర్శవంతమైన నేత.

తెరిచిన పుస్తకం ఆర్ఎస్

కోనాల భీమారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి



కులమతాలు, అసమానతలు రూపుమాపేందుకు ఆర్ఎస్ నిరంతరం పాటుపడ్డారు. భిన్నత్వంలో ఏకత్వం నినాదంతో ముందుకు సాగారు. బడుగు బలహీనవర్గాలు, కార్మికుల హక్కుల కోసం పోరాడారు. రైతాంగ పోరాటాలు, ప్రధానంగా గిట్టుబాటు ధర సాధనకు బలమైన పోరాటాలు సాగించారు. ఆర్ఎస్ అంటే చైతన్యం, నమ్మకం, స్ఫూర్తి. మొత్తంగా చెప్పాలంటే ఆయన ఒక తెరిచిన పుస్తకం.

ఐక్యంగా ఉద్యమాలు సాగించాలి


కాటం నాగభూషణం, ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి



ఆర్ఎస్ స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు సాగించాలి. జిల్లాలో సిపిఎం అభివృద్ధిలో కీలకపాత్రదారుల్లో ఆర్ఎస్ ఒకరు. శాఖా సమావేశాలకు ఆర్ఎస్ వచ్చి రాజకీయ రిపోర్టు చెప్పి అందరినీ ఉద్యమాల బాట పట్టించేవారు. కేడర్ కుటుంబాల పట్ల అత్యంత ఆప్యాయత, ప్రేమాభిమానాలు చూపేవారు. చించినాడ తరహా ఉద్యమాలను జిల్లాలో ఐక్యంగా సాగించాలి.

రైస్‌మిల్లర్స్‌కు పెద్దదిక్కు ఆర్ఎస్


కొత్త శ్రీనివాస్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి



రైస్‌మిల్లుల్లో కార్మికులకు, యాజమాన్యాలకు అగ్రిమెంట్లు ఉంటాయి. ఈ సమయంలో ఆర్ఎస్ వస్తే తాము వినడమే తప్ప చెప్పడానికి ఏమీ ఉండదని యాజమాన్యాలు చెబుతుండేవి. ఒకసారి అగ్రిమెంట్‌కు కార్మికుల పక్షాన ఆర్ఎస్ వచ్చినప్పుడు నేను మొదటిసారి ఆర్ఎస్‌ను చూశాను. యజమానులకు, కార్మికులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా అగ్రిమెంట్ ఆయన చేశారు. ఆర్ఎస్ రైస్‌మిల్లర్స్ అందరికీ పెద్ద దిక్కుగా ఉండేవారు. ఆయన లేకపోవడం బాధాకరం.

సూచనలు, సలహాలిచ్చేవారు

ఆర్‌విఎస్.రాజు, గణపవరం ఛాంబర్ అధ్యక్షులు



జిల్లా ప్రజల్లో ఆర్ఎస్‌ది సుస్థిరస్థానం. సిద్ధాంతపరంగా ఎక్కడా రాజీపడని మనస్తత్వం ఆర్ఎస్ సొంతం. ఆర్ఎస్ స్ఫూర్తి నేటి తరానికి ఎంతో అవసరం. సామాజిక ఉద్యమాల్లో ఆర్ఎస్ నాకు అనేక సూచనలు, సలహాలిచ్చేవారు.

చించినాడ పోరాట స్ఫూర్తి ఎనలేనిది

కూనపురాజు కుమార్, ప్రముఖ రచయిత



70 ఏళ్ల క్రితం తెలంగాణా సాయుధ పోరాట సమయంలో చించినాడలో ఐదుగురిని కాల్చి చంపారు. అనంతరం ఆ గ్రామంలో సాగిన పోరాటాలు అత్యంత స్ఫూర్తిదాయకం. చించినాడ పోరాటాలను, ఆర్ఎస్‌ను వేరుచేసి చూడలేం. నిరంతర పోరాట స్ఫూర్తిదాయకులు ఆర్ఎస్.

ఆర్ఎస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - యలమంచిలి

ఆర్ఎస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని చించినాడ గ్రామంలో ఇటీవల మరణించిన సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఏ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) సంస్మరణ సభ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న అమరవీరుల స్తూపంపై జెండాను శ్రీనివాసరావు ఆవిష్కరించగా అమరవీరుల శిలాఫలకానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం నివాళులర్పించారు. ముందుగా ఆర్ఎస్ చిత్రపటానికి, సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అసాధారణ పటిమ కలిగిన ఆర్ఎస్ కమ్యూనిస్టు సిద్ధాంతాలను తూచా తప్పకుండా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పార్టీ ఉద్యమాన్ని బలోపేతం చేశారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడారు. ఆర్ఎస్ ఒక కమ్యూనిస్టు మాత్రమే కాదని, ఆయన ఒక గొప్ప మానవతావాది అని తెలిపారు. ఆయనను చూసి ఎన్నో విషయాలు నేర్చుకున్నామని తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఊహ తెలిసిన నాటి నుండి ఊపిరి ఆగిపోయే వరకూ గొప్ప కమ్యూనిస్టు నాయకునిగా పేద ప్రజల కోసమే జీవించిన ఆర్ఎస్ వంటి గొప్ప నాయకుడు జీవితాన్ని భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చించినాడలో ఉద్యమాన్ని నిర్మించడానికి ఆర్ఎస్ చేసిన కృషి అమోఘమని అన్నారు. అటువంటి నాయకుడి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. మాజీ ఎంఎల్ఏ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడారు. దళితులు, వెనుకబడిన వర్గాల్లోని ప్రజలకు అధికారులు, అన్యాయం చేస్తే వారిపై ఎదురు తిరిగి ప్రశ్నించే స్వభావాన్ని ధైర్యంగా ముందుకు సాగే పరిస్థితులను ఆర్ఎస్ ద్వారానే కలిగిందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఆర్ఎస్ జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పొగాకు పూర్ణ, ఆర్ఎస్ కుమార్తెలు సుశీల, స్వరాజమాత, అల్లుళ్లు నరసింహ రాజు, రామకృష్ణంరాజు, కృష్ణమూర్తి రాజు, గ్రామ మాజీ సర్పంచి ఆర్ఎస్ తమ్ముడు కుమారుడు రుద్రరాజు సత్యనారాయణరాజు, ఆర్ఎస్ సహాయకులు విజయ, గ్రామ మాజీ ఉప సర్పంచి హృదయరాజు సత్యనారాయణ రాజు (వైజాగ్‌రాజు) పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ఆర్ఎస్ తో 60 ఏళ్ల అనుబంధం

సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు



ఆర్ఎస్‌తో 60 ఏళ్ల ఉద్యమ అనుబంధం ఉంది. ఆయన అమరులైన ఐదుగురు కమ్యూనిస్టుల తరువాత పార్టీని ఈ స్థాయిలో నిర్మించడానికి ఆర్ఎస్ చేసిన కృషే కారణం.

20 టన్నుల ఇసుక.. రూ.23 వేల పైనే..!

- ఇసుక కోసం అల్లాడిపోతున్న ఇళ్ల నిర్మాణదారులు
- బుకింగ్ కోసం నానా తంటాలు
- 1, 2 రోజుల్లో సరఫరా ఉత్తిమాటే
- కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట స్టాక్‌పాయింట్‌లో మాత్రమే ఇసుక
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక కష్టాలపై జనం ఆగ్రహం

ఇసుక కష్టాలు జనాన్ని వెంటాడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక కష్టాలు వర్ణాతీతంగా మారాయి. టన్ను ఇసుకకు రూ.1,100లకుపైగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుకింగ్ కష్టాలు, సరఫరాలో తీవ్ర జాప్యంతో నిర్మాణదారులు విసిగిపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు మాత్రం ఉచిత ఇసుక భేష్ అంటూ కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తున్న తీరుపై జనాగ్రహం పెల్లుబుకుతోంది. ఇసుక కష్టాలు తీరేదెన్నడు అని జనం తలపట్టుకుంటున్న పరిస్థితి రెండు జిల్లాల్లో కొనసాగుతోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



గత ప్రభుత్వ హయాంలో 20 టన్నుల ఇసుక రూ.18 వేలకు కొనుగోలు చేస్తే.. ఉచిత ఇసుక అంటూ చెబుతున్న కూటమి ప్రభుత్వం మాత్రం 20 టన్నుల ఇసుకకు రూ.23,260 వసూలు చేయడంపై జనాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఇసుక కొనుగోలు జరుగుతున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక కష్టాలు నిర్మాణదారులకు వర్ణాతీతంగా మారాయి. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలం చేబ్రోలు, కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట, వింజరంలో మూడు స్టాక్ పాయింట్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఒక్క ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ నుంచి తప్ప ఎక్కడా ఇసుక సరఫరా చేయడం లేదు. భద్రాచలం దగ్గర్లో కుక్కునూరు మండలం ఉంది. ఇబ్రహీంపేట నుంచి ఏలూరుకు ఇసుక బుక్ చేసుకుంటే 20 టన్నులకు రూ.23,260 కట్టాల్సి వస్తోంది. దీంతో నిర్మాణదారులు గగ్గోలు పెడుతున్నారు. అంత ధర పెట్టి కొనుగోలు చేయలేక లబోదిబోమంటున్నారు. అంతేకాకుండా ఈ నెల 19వ తేదీన ఇసుక బుకింగ్‌కు సంబంధించి ప్రత్యేక పోర్టల్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. జిల్లా అధికారులు సైతం పోర్టల్ గురించి గొప్పగా చెప్పారు. ఎపి శ్యాండ్ మ్యానేజ్ మెంట్ సిస్టం పోర్టల్‌లో ఇసుక బుక్ చేసుకుంటే ఒకటి లేక రెండు రోజుల్లో ఇసుక సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఏలూరులోని కొంత మంది నిర్మాణదారులు 19వ తేదీన ఇసుక బుక్ చేసుకుంటే ఐదు రోజులు గడిచినా ఇసుక చేరని పరిస్థితి నెలకొంది. లారీ యాజమానులకు ఇప్పటికే రవాణా చేసిన ఇసుకకు ప్రభుత్వం సొమ్ములు చెల్లించకపోవడంతో లారీలు పెట్టడం లేదని చెబుతున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్లు సరిగ్గా పనిచేయడం లేదని జనం గగ్గోలు పెడుతున్న పరిస్థితి నెలకొంది. గతంలోకంటే 20 టన్నుల ఇసుకకు రూ.ఐదు వేలకు పైగా అదనంగా చెల్లించాల్సి రావడంతో ఇళ్లు నిర్మించుకునే సామాన్య ప్రజానీకానికి పెనుభారంగా మారింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు లేవు. పూర్తిగా తూర్పుగోదావరి జిల్లా స్టాక్‌పాయింట్లపైన ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండే పందలపర్రు, పెండ్యాల స్టాక్‌పాయింట్లలో ఇసుక లేదని ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. ఇంకా దూరంగా ఉన్న స్టాక్‌పాయింట్లలో బుక్ చేస్తే ఛార్జీల భారం పెద్దఎత్తున అవుతోంది. దీంతో రెండు జిల్లాల ప్రజానీకం ఇసుక కోసం పడుతున్న పాట్లు వర్ణాతీతం. ఇసుక సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

	Particulars	Quantity (MTs)	Price (₹ Per MT)	Total (₹)
	Towards cost of sand	20 MT	0.00	0.00
	Cost of operations	20 MT	102.48	2,049.52
	Statutory Levies	20 MT	88.00	1,760.00
	Transportation Charges			18,342.86

	Particulars	Quantity (MTs)	Price (₹ Per MT)	Total (₹)
		Total Taxable Value(1+2+3+4) :		22,152.38
	...venty Three Thousand Two ...dred and Sixty Rupees Only	CGST @ 2.5% :		553.81
		SGST @ 2.5% :		553.81
		Total Amount to be Paid :		₹ 23,260.00

ఇబ్రహీంపేట నుంచి ఇసుక సరఫరాకు ఆన్‌లైన్ ధర ఇలా

ఉపాధి లేక అల్లాడుతున్న కార్మికులు..

ఇసుక కొరతతో భవన నిర్మాణ పనులు పూర్తిగా మందగించాయి. నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో రెండు జిల్లాల్లో దాదాపు రెండు లక్షల మంది కార్మికులకు పనులు లేకుండా పోయాయి. తాపీ పనివారు పనిలేక ఖాళీగా ఉంటున్నారు. నిర్మాణరంగంలో 32 పనులకు సంబంధించిన వారు ఆధారపడి ఉన్నారు. పెయింటర్లు, వడ్రంగి, సెంట్రింగ్ పనివారు ఇలా అనేక రంగాల వారికి పనిలేకుండా పోయింది. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు కావడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటినా ఇసుక సమస్యను పరిష్కరించలేదు. దీంతో పనిలేక అల్లాడుతున్న కార్మికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇసుక సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంతా డిమాండ్ చేస్తున్నారు.

నేతల మృతి కార్మికోద్యమానికి తీరనిలోటు

ప్రజాశక్తి - నరసాపురం

సిఐటియు పట్టణ కార్యదర్శి కార్మిక వర్గ నాయకుడు పొన్నాడ రాము, సిఐటియు సీనియర్ నాయకులు వంకల రాములు మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటు అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ అన్నారు. స్థానిక మీరా స్మారక గ్రంథాలయంలో బుధవారం ఇరువురు నాయకుల సంస్మరణ సభ సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు సిఐటియు పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ పొన్నాడ రాము 12 ఏళ్ల వయసు నుంచి అటుకుల మిల్లులో రోజువారీ అర్ధ రూపాయి జీతానికి కార్మికుడిగా జీవనం సాగించి యువకుడుగా భారత ప్రజాతంత్ర యువజన సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితుడైనట్లు తెలిపారు. యువజన సంఘంలో చురుకైన పాత్ర పోషించి డివైఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి యువతను దేశభక్తి భావాలవైపు ఉద్యోగం ఉపాధి కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి ఒక క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా తనను తాను రూపొందించుకున్నాడన్నారు. అనంతరం ఊక జట్టు కార్మికుడిగా జీవనం సాగిస్తూ కార్మిక వర్గం హక్కుల కోసం వారి ప్రయోజనాల కోసం నిరంతరం కార్మికులు ప్రజల పక్షాన జరిగే పోరాటాల్లో రాము ముఖ్యపాత్ర పోషించారన్నారు. నరసాపురం పట్టణంలో రైస్ మిల్లు బజాజ్ జట్లు హమాలీ కార్మికులకు నాయకుడిగా సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఆశా, అంగన్వాడీ మిడ్ డే మీల్స్ మున్సిపల్, రైల్వే కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలపై జరిగే ఉద్యమాల్లో రాము తనదైన పాత్రను పోషించారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ నరసాపురంలో ఉన్న 2000 మంది రిక్షా కార్మికులను ఐక్యపరిచి ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యం చేయడంలో వంకల రాములు కృషి ఎనలేనిదన్నారు. రిక్షా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిన వ్యక్తి రాముల అని, ఆయన లేని లోటు కార్మిక వర్గానికి తీరనిలోటు అని కొని ఆడారు. అల్లూరి సాంస్కృతిక కేంద్రం నిర్వాహకులు బాబు మాజీ ఎంసి చైర్మన్ దొండపాటి స్వామి ఇరువురు మాట్లాడుతూ పొన్నాడ రాము మంచి కార్మిక వర్గ నాయకుడు అన్నారు. అంగన్‌వాడీ, ఆశా ఎలక్ట్రికల్ ఉద్యోగుల సంఘం నాయకులు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ, చార్మినార్ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో నోముల కొండ, కోడూరి బద్రి, పొన్నాడ మల్లేష్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజా రామ్మోహన్ రాయ్

వసతి గృహ విద్యార్థులను సొంత బిడ్డల్లా భావించాలి

హెచ్‌డబ్ల్యూఒకు సూచించిన జెసి

తాడేపల్లిగూడెం: వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను హెచ్‌డబ్ల్యులు తమ సొంత బిడ్డల్లా భావించి, వారు బాగా చదువుకునేలా ప్రోత్సహించాలని పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం తాడేపల్లిగూడెం ప్రభుత్వ బిసి బాలికల వసతిగృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, బిటెక్, పీజీ చదువుకుంటున్న విద్యార్థినీలతో ఆయన మాట్లాడారు. వసతిగృహాలలో వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాలలో ఎవరికైనా ఎటువంటి ఇబ్బందులు కలిగినా భయపడకుండా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ సందర్భంగా వంట తయారు చేసే గదులు, పిల్లలు ఉంటున్న గదులను, బాత్రూమ్‌లు, హాస్టల్ పరిసరాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాలకు నిరుపేదల పిల్లలు చదువుకోవడానికి వస్తారు, వారిని సొంత బిడ్డల్లా భావించి బాగా చదువుకునేలా ప్రోత్సహించాలని వసతిగృహాల అధికారులతో అన్నారు. ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. మరుగుదొడ్లు సరిగా లేవని, తాగునీటి సౌకర్యాలు లేవని, చదువుకోవడానికి సరైన లైటింగ్ లేదని, తదితర సమస్యలు తన దృష్టికి రాకూడదని అన్నారు. వసతిగృహాల అధికారులు మీ బాధ్యతలను గుర్తించి, హాస్టల్ నిర్వహణ పటిష్టంగా చూడాలన్నారు. బాధ్యతలపై నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన, శుభ్రత కలిగిన ఆహారం అందించాలని సూచించారు. ప్రస్తుతం 52 మంది విద్యార్థినులు ఉంటున్న భవనం ఇరుకుగా ఉన్నందున అదనంగా వేరే భవనాన్ని అద్దెకి తీసుకోవాలని వసతిగృహం అధికారిని జెసి ఆదేశించారు. ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి జివిఆర్‌కెఎస్ఎస్.గణపతి, సహాయ సంక్షేమ శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, వసతిగృహ అధికారి పాల్గొన్నారు.

పిల్లల్లో శాస్త్రీయత పెంచేందుకే సైన్స్ సంబరాలు

కాళ్ల : పిల్లల్లో శాస్త్రీయత పెంపొందించడం కోసమే జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తోందని చెకుముకి మండల కన్వీనర్ బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా పాఠశాల స్థాయి చెకుముకి టెస్టులు బుధవారం నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించారు. ప్రథమస్థానం పొందినవారు అక్టోబర్ 1న మండలస్థాయి సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆడపిల్లలు ఆత్మ రక్షణలో ధీటుగా ఉండాలి

వైద్య, ఆరోగ్య హెల్త్ ఎడ్యుకేటర్ రామారావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

కిశోరబాలికలు శారీరకంగా, మానసికంగా బలంగా ఉండి, ఆత్మరక్షణలో ధీటుగా నిలవాలని వైద్య ఆరోగ్య ఎడ్యుకేటర్(పెనుమంట్ర) పిబి.రామారావు అన్నారు. బుధవారం స్థానిక విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆడపిల్లల ఆరోగ్యం, రక్షణ, వివాహం తదితర అంశాలపై ఆయన, మహిళా పోలీస్ ఎస్.దేవి, తదితరుల శిక్షణ అందించారు. పాఠశాలలో 6 నుంచి 10 వరకు చదివే విద్యార్థినులు తమని తాము వివిధ పరిస్థితులలో ఎలా రక్షించుకోవాలో చక్కగా వివరించారు. మంచి గోల్స్ పెట్టుకొని ఆడపిల్లలు జీవితంలో ఎదగాలని పాఠశాల కార్యదర్శి, కరస్పాండెంట్ తేతలి సంజీవ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంఎల్‌హెచ్‌పిలు ఎం.కుమారి, జి.రేవతి, ఆశ, అంగన్వాడీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు


ప్రజాశక్తి - నరసాపురం

పాఠశాల క్రీడా సమాఖ్య(ఎసిఎఫ్) ఆధ్వర్యంలో ఎల్‌బిచర్ల జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు ముగిసాయి. రెండో రోజు బుధవారం అండర్-14, 17 బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చదరంగం, యోగా, షటిల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. 95 మందిని జిల్లా పోటీలకు ఎంపిక చేసినట్లు అడపా రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఇటిలు రాజశేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

మండపాక విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు

డిఎస్‌ఎ స్విమ్మింగ్ స్టేడియం ఏలూరులో బుధవారం జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్విమ్మింగ్ సెలెక్షన్స్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండపాక విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల హెచ్‌ఎం ఆర్.మోహన్‌బాబు తెలిపారు. అండర్-14 విభాగంలో జి.తరుణ్, కె.చరణ్, అండర్-17 విభాగంలో ఎస్.గణేష్, ఎ.శ్యామ్, బి.భార్గవ్, ఆర్.ఎల్లపరాజు, జి.అభిషేక్ జిల్లా స్విమ్మింగ్ జట్టుకు ఎంపికైయ్యారన్నారు. వీరు అక్టోబర్‌లో పల్నాడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం ఆర్.మోహన్‌బాబు తెలియజేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు సంకు సూర్యనారాయణను గ్రామ సర్పంచి జానా వెంకటలక్ష్మీ, టిడిపి గ్రామ నాయకులు ఆత్మకూరు రామకృష్ణ, పాఠశాల ఎఎంసి చైర్మెన్ గూడూరి మహాలక్ష్మీ, పాఠశాల సిబ్బంది అభినందించారు.



పొత్తూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపిడిఒ

రామరాజును కలిసిన ఎంపిడిఒ త్రిశూలపాని

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజును ఇటీవల మొగల్తూరు ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన త్రిశూలపాని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ త్రిశూలపాని రామరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు మొగల్తూరు మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించుకున్నారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

భూమి లాక్కున్న వారిపై చర్యలు తీసుకోవాలని పేరుపాలెం సౌత్‌కి చెందిన తిరుమాని గంగ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం మొగల్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమకు మూడు సంవత్సరాల కిందట ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉండటంతో రుణం కోసం గ్రామానికి చెందిన వ్యక్తులను సంప్రదించానన్నారు. భీమవరంకు చెందిన వ్యక్తికి భూమి తనకా పెడితే రుణం ఇప్పిస్తానని నమ్మించారు. ఆ సమయంలో మేము భూమి విక్రయించినట్లుగా క్రయ దస్తావేజులు వారి పేరుతో రాయించుకున్నారు. ఇటీవల మేము తనకా రద్దు చేయవలసిందిగా కోరినా వారు స్పందించలేదు. దీంతో మేము సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లి ఇసి తీయించుకోగా వేరొకరికి విక్రయించినట్లుగా ఇసిలో నమోదు అయినట్లు ఉందని తెలిపారు. దీనిపై ప్రశ్నించి మాకు మాభూమి అప్పేగించాలని కోరిన మధ్యవర్తి, బాధ్యుడు దాడులకు పాల్పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

గర్భిణులకు సీమంతం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

శివదేవునిచిక్కాల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ పాలకొల్లు ప్రాజెక్టు అధికారిని ఇందిరా ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాల సందర్భంగా గర్భిణులకు తహశీల్దార్, ఎంపిడిఒ కూటమి నాయకులు చేతులమీదుగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీల ద్వారా అందే బాల సంజీవని కిట్టును పాలు, గుడ్లను ఉపయోగించుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్స్ ఎన్.మంగ, పులఖండం సత్యవేణి, ఎన్.మల్లేశ్వరి పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండలంలోని పొలమూరు గ్రామంలో అంగన్వాడీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ మహిళలకు పూలు, పండ్లు, గాజులు, నూతన వస్త్రాలను అందజేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం అంగన్వాడీ పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాకర రాజేశ్వరరావు, మాజీ సర్పంచి చింతపల్లి రామకృష్ణ, ఎంపిటిసి మచిరెడ్డ దుర్గ, సర్పంచి గూడూరి దేవేంద్రుడు పాల్గొన్నారు.

గ్రామసింహాల స్వైరవిహారం

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామంలో సంచరిస్తున్న వీధి కుక్కలతో గ్రామస్తులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని గ్రామాలలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కుక్కలు విపరీతంగా పెరిగిపోయి రహదారులపై సంచరిస్తూ పాదాచార్లు, వాహనచోదకులపై దాడులకు పాల్పడుతున్నాయి. పలువురుపై దాడి చేసి కరవడంతో ఆసుపత్రి పాలవుతున్నారు. కుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లింగవివక్షపై అవగాహన

ప్రజాశక్తి - తణుకు

ప్రతీఒక్కరూ ఆడ, మగ అనే లింగ వివక్ష లేకుండా చిన్నప్పటి నుంచే పిల్లలకి నేర్పించాలని నాల్గవ అదనపు జిల్లా జడ్జి సత్యవతి అన్నారు. బుధవారం స్థానిక కోర్టు భవనముల సముదాయంలో లింగ వివక్షపై అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ లింగ వివక్ష జరుగుతూనే ఉందన్నారు. ఇప్పటికీ అనేక కార్యాలయాల్లో ఉద్యోగాలు చేస్తున్న మహిళల పట్ల లైంగిక వేధింపులు జరుగుతున్నాయని, వాటిని వెంటనే ఖండించాలని సూచించారు. లేని ఎడల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరూ మహిళల పట్ల గౌరవం కలిగి ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.సత్యకృష్ణలత, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు పి.సాయిరాం, కెవిఎన్ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఎంఎంసి ఉద్యోగి మృతి

కాళ్ల : కాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నరిసింహపురం చెక్‌పోస్ట్ వద్ద ఎఎంసి సిబ్బందిగా పనిచేస్తున్న సాల వెంకటేశ్వరరావు(48)ను మంగళవారం అతివేగంగా లారీ ఢీకొట్టింది. గాయలైన వెంకటేశ్వరరావు భీమవరంలో ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పంచనామా నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెంకటేశ్వరరావు మృతదేహాన్ని తరలించారు. మృతుడి వెంకటేశ్వరరావుది భీమవరం టూ టౌన్ రాయలం. మృతుడి వెంకటేశ్వరరావు కుమార్తె శ్రావణి ఫిర్యాదు మేరకు కాళ్ల ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌ఎస్ మృతి తీరని లోటు

సంస్మరణ సభకు మోటార్ సైకిల్ ర్యాలీగా తరలిన నేతలు

తాడేపల్లిగూడెం: జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, రైతు, కార్మిక నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణ రాజు(ఆర్‌ఎస్) మృతి జిల్లా ఉద్యమానికి, కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని తాడేపల్లిగూడెం సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. ఆర్‌ఎస్ సంస్మరణ సభ భీమవరంకు తాడేపల్లిగూడెం సిపిఎం పట్టణ కమిటీ నుంచి మోటార్ సైకిల్ ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఆయన ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చేరారని, 1967వ సంవత్సరంలో నరసాపురం నియోజకవర్గం నుంచి ఎంఎల్ఏగా గెలుపొంది, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేసేవారని ఆయన తెలిపారు. ప్రజల పక్షాన మాట్లాడడానికి, పోరాడడానికి తన విద్యార్థి జీవితంలో అంకితమైన ఆర్‌ఎస్ తుదిశ్వాస విడిచే వరకూ అదే బాటలో నడిచారని ఆయన అన్నారు. 12 సంవత్సరాల వయస్సులో ఆర్‌ఎస్ చించినాడ గ్రామానికి సర్పంచిగా ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. ఆర్‌ఎస్ ప్రజా ఉద్యమాల్లో చేసిన కృషిని స్మరించుకోవడం మన కర్తవ్యంగా భావించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, సిరపరపు రంగారావు, యాండ్రపుకృష్ణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మేట్రేడ్డి రమణ, నరమాల కృష్ణ, పులిమంతుల రమణ, అన్నం చిన్నారావు, వర్రి అప్పారావు, యడవల్లి వెంకట దుర్గారావు పాల్గొన్నారు.

నరసాపురం : కామ్రేడ్, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు(ఆర్‌ఎస్) మృతి సిపిఎం పార్టీకి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అన్నారు. బుధవారం యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో జరుగుతున్న ఆర్‌ఎస్ సంస్మరణ సభకు నరసాపురం నుంచి పెద్ద ఎత్తున సిపిఎం నాయకులు మోటార్ సైకిల్ ర్యాలీగా తరలివెళ్లారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, జల్లి రామ్మోహన్ రావు, యడ్ల చిట్టిబాబు, పొగాకు నారాయణ రావు ఉన్నారు.



తాడేపల్లిగూడెం: ర్యాలీగా వెళుతున్న నాయకులు

రైతులకు తెగుళ్లు, పురుగులమందులపై అవగాహన

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - పెనుమంట్ర

స్థానిక మండలం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలమూరు, మాముడూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి ఎ.జోషిలా మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో వరి పంటపై ఆశించే తెగుళ్ల పురుగుల గురించి రైతులకు అవగాహన కలిగించారు. ముఖ్యంగా రైతులు యాజమాన్య పద్ధతుల్లో కొన్ని సలహాలు, సూచనలు తీసుకోవాలని తెలియజేశారు. వరిలో ఎండాకు తెగులు ఎక్కువగా ఆశిస్తున్న మూలన రైతులు యాజమాన్య పద్ధతులతో పాటు ముఖ్యంగా ఎంఒపి ఎరువులు తప్పకుండా వేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు వారి సమస్యలను ఈ కార్యక్రమంలో వివరించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఏవిధమైనటువంటి ఇబ్బంది పడకుండా చేయటానికి ప్రస్తుత ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దానికి అనుగుణంగా జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం రైతులు వారి ధాన్యం వారికి కావలసినటువంటి రైస్‌మిల్లుకి పంపుకునే విధంగా వెసులుబాటు కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కాకర రాజేశ్వరరావు, గూడూరి దేవేంద్రుడు, ఎంపిటిసి సభ్యులు పెనుమత్స వివేక రాఘవేంద్ర రాజు, తోరం వెంకన్న బాబు, చింతపల్లి రామకృష్ణ, వెలగల బుల్లి రామిరెడ్డి, పాల సముద్రుడు, గూడూరు మురళీ పాల్గొన్నారు.

ఆచంట : తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడానికి మేలైన వరి వంగడాలను వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి జి.సత్యనారాయణ అన్నారు. పోడూరు మండలం మట్టపర్రు, జిన్నూరు గ్రామాల్లో ఆయా సర్పంచులు దొమ్మేటి శ్రీను, జమ్మూ బేబీ మహాలక్ష్మి అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతికత పరిజ్ఞానం ఉపయోగించుకొని అధిక దిగుబడులు పొందాలని సూచించారు. రైతు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా ఆకు ఎండు తెగులు నివారించుకోవచ్చని, నీటి యాజమాన్యం పాటించాలని, నత్రజని ఎరువులను సిఫారసు మేరకు వినియోగించాలని రైతులకు సూచించారు. మండల పశు వైద్యాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పశువులకు వేయించవలసిన టీకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేత హరికృష్ణ, గుబ్బల వెంకటేశ్వరరావు, దేవల రామకోటి, తులసీరామ్, కుక్కల సత్యనారాయణ, సూర్యనారాయణ, సొసైటీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతతోనే దేశ సర్వతోముఖాభివృద్ధి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గాంధీజీ ఆశయాలే దేశ ప్రగతి అని, జాతీయ సమైక్యతతోనే దేశ సర్వతోముఖాభివృద్ధి అని సర్ సివి రామన్ స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత, సంస్కార్ స్కూల్ ప్రిన్సిపల్ ఎ.సత్యవతి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి సంయుక్త ఆధ్వర్యంలో సర్ సివి రామన్ స్కూల్, సంస్కార్ స్కూల్లో మహాత్మాగాంధీ జయంతి పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అంటరానితనం నిర్మూలన అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సరిత, సత్యవతి మాట్లాడుతూ విద్యార్థుల్లో గాంధీతత్వం పెంపొందించేలా పెద్దలు కృషిచేయాలని, గాంధీ ప్రభోదలే జాతి ఔన్నత్యానికి పట్టుకొమ్మలని అన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతులను వారోత్సవాలు, పక్షోత్సవాలుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ వరకు వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని, గెలుపొందిన వారికి ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28న మున్సిపల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పురపాలక మున్సిపల్ సాధారణ సమావేశం ఈనెల 28వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి సకాలంలో కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని ఆమె కోరారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు హలన్య కోమలి ఎంపిక

ప్రజాశక్తి - గణపవరం

అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్ తొమ్మిదవ తరగతి చదువుతున్న ఎం.హలన్య కోమలి ఎంపికైనట్లు హైస్కూల్ పీడీ ఎం.పద్మావతి బుధవారం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన హలన్య కోమలిని హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎంవిఎస్ఎన్.మూర్తి అభినందించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం

ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

సిఎం సహాయనిధి పేదల పాలిట వరమని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. నరసాపురం మండలం వేములదీవి గ్రామంలో పోతబాతుల ఈశ్వర్ రావు ఎఒఎస్‌డి వ్యాధితో బాధపడుతున్నారు. వైద్యం నిమిత్తం రూ.5 లక్షల వరకు అవసరమయ్యాయి. ఈ విషయాన్ని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే నాయకర్ వారికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2,50,000 మంజూరు చేయించి, ఆ పత్రాన్ని అందజేశారు.

వేతన బకాయిలపై ఆరా

ప్రజాశక్తి - తణుకు



కార్మికులతో మాట్లాడుతున్న నాగలక్ష్మి

తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది వేతన బకాయిలు, పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు ఉన్నాయన్న నేపథ్యంలో వాళ్ల గతంలో జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఒకసారి పరిశీలించి కాంట్రాక్టర్‌కి నోటీసులు పంపించమని ఆదేశాలు ఇచ్చారని నరసాపురం సహాయక కార్మికశాఖ కమిషనర్ ఎ.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డ్సు వేతన బకాయిలు, పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలపై కార్మికుల నుంచి సహాయక కార్మికశాఖ కమిషనర్ నాగలక్ష్మి వివరాలు అడిగితెసుకున్నారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు మూడు నెలల నుంచి, సెక్యూరిటీ గార్డ్స్‌కి రెండు నెలల నుంచి వేతన బకాయిలున్నాయన్నారు. పారిశుధ్య కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం రూ.16 వేలు ఇవ్వాల్సి ఉందన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ పోను వాళ్లకి నెట్ శాలరీ రూపంలో రూ.11,858లు, సూపర్‌వైజర్స్‌కి రూ.13,046, సెక్యూరిటీ గార్డ్స్‌కి రూ.8 వేలు, సూపర్‌వైజర్స్‌కి రూ.10 వేలు జీతాలు జమ అవుతున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని డిపార్టుమెంట్ ప్రకారం జాయింట్ కమిషనర్ దృష్టిలో పెట్టి కాంట్రాక్టర్‌కి నోటీసులు ఇచ్చి, తొందరలోనే కార్మికుల ఖాతాలో జమఅయ్యే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.లక్ష్మణరావు, జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ వి.అరుణ పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ మార్లింగం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రతి విద్యార్థిని గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎఎస్ఐ ఎస్.మార్లింగం అన్నారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పూలపల్లి హై స్కూల్‌లో బుధవారం బేటి బచావో బేటి పడావో, వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థినులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం హైస్కూల్ హెడ్ మాస్టర్ జిటి.వెంకట కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ మార్లింగం మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని క్రమశిక్షణతో మెలగాలని, సెల్‌కు దూరంగా ఉంటూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.సత్యవేణి పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీహరి రాజు, నూకల శ్రీను, నాలం రఘు, మాదాసు లలిత, మహిళా పోలీస్ ఎం.వరలక్ష్మి, అంగన్వాడీ టీచర్స్ లత, పద్మ, రజిని పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - నరసాపురం

ఆర్‌టిసి ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తోన్నట్టు నరసాపురం ఆర్‌టిసి డిఎం ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. కార్గోసేవలు, బస్సులకు సంబంధించిన ఇబ్బందులపై సలహాలు, సూచనలు, ఫిర్యాదులుంటే సెల్ నెంబర్‌కు 99592-25486 తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

మురుగు కాలువలను ప్రక్షాలన చేయిస్తా

'ఇది మంచి ప్రభుత్వం'లో భీమవరం ఎంఎల్ఎ పులపర్తి అంజిబాబు

ప్రజాశక్తి - వీరవాసరం

రైతు ప్రయోజనాల కోసం అవసరమైతే రైతులతో సంప్రదించి, క్రాప్ హాలిడే ప్రకటించి, మురుగు కాలువాలను ప్రక్షాలన చేయిస్తానని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం మత్స్యపురిలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ గత ఎంఎల్ఎ మత్స్యపురిలో ప్రవర్తించిన తీరు రాష్ట్రంలో ఏ ఎంఎల్ఎ కూడా చేసి ఉండడన్నారు. నరసాపురం రూరల్ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్, సబ్ రిజిస్టర్ కార్యాలయాలను వీరవాసరం మండల పరిధిలోకి తీసుకురావాలని స్థానికులు ఎంఎల్ఎను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కారిపెల్లి శాంతిప్రతియ, మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మీ, టిడిపి నాయకులు కోళ్ల నాగేశ్వరావు, మేంటే పార్థసారథి, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి, పిప్పళ్ల నాని, ఎంపిటిసి గోడి ఆదిలక్ష్మీ, ఆకుల లీలాకృష్ణ, హరిబాబులు పాల్గొన్నారు.

పేదవాడి ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్

ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ఆచంట : పేదవాడి ఆకలి తీర్చేందుకు 100కు పైగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం రాత్రి పోడూరు మండలం గుమ్ములూరులో ఇది మంచి ప్రభుత్వం 100 రోజుల వేడుకను పురస్కరించుకుని ప్రజావేదిక నిర్వహించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకే ప్రజావేదిక ఏర్పాటు చేశామన్నారు. ఆచంట వేమవరంలో రూ.25 లక్షల వ్యయంతో రహదారుల నిర్మాణం చేపడతామన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. గ్రామ సర్పంచి జి.సౌన్య రాణి, మండల ఎంపిపి సబ్బితి సుమంగళిలి, క్లస్టర్ ఇన్‌ఛార్జి రుద్రరాజు రమేష్ బాబు, ఆచంట మండల జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, జనసేన మండల అధ్యక్షులు రావి హరీష్ బాబు, ఎంపిడిఒ సువాసిని పాల్గొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఎవరికైనా అన్యాయం జరిగితే చెప్పుకునే పరిస్థితి ఉండేది కాదని, నేడు ఇటువంటి పరిస్థితులు లేకుండా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని సర్పంచి గుబ్బల మాధవరావు అన్నారు. బుధవారం సాయంత్రం భీమలాపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని శివదేవుని చిక్కాల గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొని మాట్లాడారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రజలంతా అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి మంచి ప్రభుత్వంగా కొనియాడుతున్నారని తెలిపారు. ఎంపిడిఒ సంఘాని వెంకటేశ్వరరావు, ఎంఆర్ఒ ఎడ్ల దుర్గాకిషోర్, ఎపిఎం జ్యోతి, నాయకులు ఉన్నమట్ల కబర్ది, పాముల రజినీకుమార్, బల్ల వాసు, ఇంటి శ్రీరాముడు, అంగర వీరభద్ర కుమార్ పాల్గొన్నారు.



నరసాపురం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న చాగంటి చిన్న

నరసాపురం: మండలంలోని కొత్త నవరసపురం గ్రామంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో పేదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా కేవలం రూ.5లతోనే ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు.

తణుకు రూరల్ : ఇచ్చిన మాట నిలబెట్టుకొని రాష్ట్రంలో పింఛన్‌దారులకు నెలలో మొదటి రోజున పింఛన్లు అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి, ఎంపిపి రుద్రరాజు ధనరాజు, ఎఎంసి మాజీ చైర్మన్ చిట్టూరి సునంద పాల్గొన్నారు.

పెనుమంట్ర : వైసిపి మంత్రులు, ఎంఎల్ఎలు, రాజ్యసభ సభ్యులు పార్టీలు మారుతున్నారని, త్వరలో వైసిపి కనుమరుగవుతుందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ధ్వజమెత్తారు. బుధవారం మండలంలోని పొలమూరు, మాముడూరులో ఇది మంచి ప్రభుత్వం 100 రోజుల కూటమి పాలన పురస్కరించుకుని ప్రజావేదికను నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రహదారులు శుభ్రం

పలుచోట్ల 'స్వచ్ఛతా హి సేవా'

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం మెయిన్ రోడ్డు రహదారులను మున్సిపల్ కార్మికులు శుభ్రం చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి రహదారులని శుభ్రపరిచే కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ, కమిషనర్ అంజయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎనిమిదవ రోజు సరిపల్లి గ్రామంలోని పలు వీధుల్లో చెత్త చెదారాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ జి.వెంకటరమణ మాట్లాడుతూ తడి, పొడిచెత్తల ప్రాధాన్యతను వివరించారు. పాస్టిక్ వాడకం అరికట్టడం వల్ల పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అభినందించారు. సోషల్ వర్క్ అధ్యాపకులు పి.భాస్కరరావు, కామర్స్ అధ్యాపకులు ఎస్.వెంకన్నబాబు, వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీ సూర్య కళాశాలలో చట్టాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - నరసాపురం

శ్రీసూర్య డిగ్రీ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహనా సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ నేటి కాలంలో ఉద్యోగం సాధించాలంటే డిగ్రీ తప్పనిసరి అని చెప్పు.. నాలుగు సంవత్సరాలు ఇష్టపడి చదివితే 40 సంవత్సరాలు గౌరవంగా బతకొచ్చని దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులు ర్యాగింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా వేధిస్తే వెంటనే పోలీసు వారిని సంప్రదించాలన్నారు. ఎవరైనా అనుచితంగా వ్యవహరిస్తే వారిని శిక్షించేందుకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. దానిలో భాగంగా క్రైమ్ యాక్ట్ ఫర్ ఉమెన్, బాలికల పట్ల పొరపాటుగా వ్యవహరిస్తే ఫోక్సో చట్టం ద్వారా శిక్ష పడుతుందని, రోడ్ సేఫ్టీ విషయానికి వస్తే తల్లిదండ్రులు ఎవరూ విద్యార్థులకు మోటార్ సైకిల్ ఇవ్వరాదని, అలాచేస్తే పిల్లల భవిష్యత్తు వారే నాశనం చేసుకున్న వారు అవుతారని తెలియజేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజి, డిగ్రీ ప్రిన్సిపల్ పి.పుల్లారావు, డిగ్రీ అకడమిక్ ప్రిన్సిపల్ టి.కృష్ణ గుప్తా పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన సప్తనదీ జలాభిషేకాలు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామంలో స్వయంభూ శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవ కార్యక్రమాలు కాండూరి వెంకటరమణాచార్యులు బ్రహ్మత్వమున ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి యాత్రికులు విశేషంగా విచ్చేసి, స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదములు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పాలకొల్లు వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 230/2020

Between:

వాది: మద్దుల సుబ్రమణ్యేశ్వరరావు

Vs

ప్రతివాదులు: గంటా శ్రీనివాసరావు అండ్ అదర్స్

1. గంటా సువార్త, D/o. లేట్ రామారావు, పెనుమర్రు గ్రామం, యలమంచిలి మండలం
2. గంటా సుజాత, D/o. లేట్ రామారావు, పెనుమర్రు గ్రామం, యలమంచిలి మండలం
3. గంటా బేబీ కుమారి, D/o. లేట్ రామారావు, పెనుమర్రు గ్రామం, యలమంచిలి మండలం

పై నెంబర్ గ్రంధంలో 3 నుంచి 5 ప్రతివాదులు అయిన మీకు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపిననూ మీరు తీసుకోకుండా కాలయాపన చేసినందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కాబట్టి **ది.01-10-2024 తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు వ్యక్తిగతంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని మీ వాదన తెలియజేయవలసిందిగా కోరుచున్నాను. లేనిచో పై దావా మీ పరోక్షముగా తీర్మనించబడును.

డి. సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, పాలకొల్లు
Cell: 98491 73674
పాలకొల్లు
తేది:25-09-2024

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పాలకొల్లు వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 226/2022

Between:

వాది: మేడిది శరత్ కుమార్

Vs

ప్రతివాది: కొల్లాపు ప్రియాంక, భర్త: ప్రవీణ్ రత్నం, ఎంప్లాయ్, కరుగోరుమిల్లి గ్రామం, ఆచంట మండలం, ప॥గో॥జిల్లా

పై నెంబర్ గ్రంధంలో మీకు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపిననూ మీరు తీసుకోకుండా కాలయాపన చేసినందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కాబట్టి **ది.30-09-2024 తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు వ్యక్తిగతంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని మీ వాదన తెలియజేయవలసిందిగా కోరుచున్నాను. లేనిచో పై దావా మీ పరోక్షముగా తీర్మనించబడును.

డి. సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, పాలకొల్లు
Cell: 98491 73674
పాలకొల్లు
తేది:25-09-2024